దశలవారీగా సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

మన్సూరాబాద్, జూన్ 14: నాగోల్ డివిజన్ పరిధి శ్రీ సాయినగర్ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం పరిసర కాలనీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరయ్యారు. కాలనీల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం వలన మ్యాన్ హోల్స్ పొంగిపొర్లి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని ఎమ్మెల్యేకు వివరించారు. రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు రోడ్లమీద గంజాయి సేవిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. పోలీసు గస్తీని పెంచి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. అల్కాపురి చౌరస్తాలోని లక్కీ రెస్టారెంట్ వద్ద ఏర్పాటుచేసిన అక్రమ పార్కింగ్ వలన కాలనీలలోకి ప్రజలు రాలేని దుస్థితి నెలకొందన్నారు. శ్రీ సాయినగర్ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో నీటి కొరత ఉన్నదని.. బోర్ వేయించి సమస్యను పరిష్కరింపజేయాలని కోరారు. సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వెంటనే నూతన స్తంభాలను ఏర్పాటు చేయించాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభా నేపథ్యంలో కాలనీలలో నూతన మంచినీటి పైపు లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లను ఆక్రమించి చేపడుతున్న వ్యాపారాల వలన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కాలనీలవాసులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ, ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నానని తెలిపారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను దశలవారీగా పరిష్కరింప చేస్తానన్నారు. కాలనీలలో పోలీసు గస్తీని పెంచడంతోపాటు ట్రాఫిక్ సమస్యను పరిష్కరింప చేస్తానన్నారు. నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు మంచినీటి వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, శ్యాంసుందర్ రెడ్డి, కాలనీల వాసులు యుగంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాసచార్యులు, గోపాలరావు, శ్రీనివాసరావు, సుధీర్ రెడ్డి, భీమిడి వెంకటరెడ్డి, కర్రీ సూర్యప్రకాష్, అరవింద్ రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, అశోక్ కుమార్, వినోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పెద్దబావి' మల్లారెడ్డి గార్డెన్ దగ్గర

నాలా సమస్య తీరేదెన్నడో?

బడంగ్ పేట్ పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్ దగ్గర ఉన్న నాలా మురికి కూపంగా మారిన దృశ్యం. వరద నీరు పోవడానికి దారి బంద్

బడంగ్ పేట్, జూన్ 14: బడంగ్ పేట్ పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ దగ్గర ఉన్న నాలా సమస్య పరిష్కారం ఇప్పట్లో అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి అన్ని విభాగాల అధికారులు పలుమార్లు పరిశీలించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులతో పాటు హైడ్రా అధికారులు కూడా ఈ సమస్యను పరిశీలించారు. అయినా కూడా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. అసలే వర్షాకాలం. పైనుంచి భారీగా వరద వస్తుంది. ఆర్‌సీఐ, ఆ పైన ఉన్న చెరువుల నుంచి వచ్చే వరద నీరు సైతం ఈ నాలా ద్వారానే పోవాలి. ఈ నాలా గతంలో భారీ వర్షం కురిసినప్పుడు వాహనాల రాకపోకలు సైతం బంద్ అయిన సంఘటనలు ఉన్నాయి. పైన వెంచర్లు చేసిన వాళ్లు ఎక్కడికక్కడ నాలాను కుదించి వేశారు. నాలా కింద ఉన్న భూ యజమానులు వారి భూములలో మట్టి పోసుకోవడంతో నాలా నీళ్లు పోవడానికి దారి లేకుండా పోయింది. దీంతో వరద నీరంతా రోడ్లపైకి వచ్చే అవకాశం లేకపోలేదు. బడంగ్ పేట నుంచి టాటా కంపెనీ, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి పోయే ప్రధాన రహదారి ఇదే. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి ఈ సమస్యను అధికారులు దాటవేస్తూ వస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వరద నీరు రోడ్లపైకి వస్తోంది. ఈ సమస్యను పరిష్కారం చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వరద నీరుతోపాటు డ్రైనేజీ కలిపారు..

పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్ దగ్గర ఉన్న నాలాలో వరద నీరుతోపాటు మురుగునీరు పోవడానికి అక్కడే కనెక్షన్ కలిపేశారు. మురుగునీరు బయటకు పోలేక మురికి కూపంగా మారింది. వరద నీరు, మురుగునీరు అంత ఒకే చోట చేరడంతో కుంటను తలపిస్తోంది. వర్షాకాలం కావడంతో ఈ సమస్య జటిలంగా మారే ప్రమాదం ఉంది. మురుగునీరు వరద నీరు అంత రోడ్లపైకి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలా సమస్యపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతా

బడంగ్ పేట్ ప్రధాన రహదారిపై ఉన్న నాలా సమస్యను తప్పనిసరిగా పరిష్కరించవలసిన అవసరం ఉంది. ఇరిగేషన్ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకపోవాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారులు నాలా ఎక్కడి నుంచి ఉందనేది వాళ్లు రిపోర్ట్ చేయవలసి ఉంది. నాలా సమస్యను పరిష్కరించకపోతే వర్షాకాలంలో ఇబ్బంది అవుతుంది.

– ఇందిరా దేవి, తహసీల్దార్, బాలాపూర్

దుర్గంధ వాసన..

పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ దగ్గర మురికి కోపంగా మారింది. మురుగునీరు ఎటు పోలేక అక్కడే ఆగడంతో సమస్య జటిలంగా మారింది. బయటనుంచి వచ్చిన వాళ్లు జంతు కళేబరాలను సైతం అక్కడే వేయడంతో దుర్గంధ వాసన వెదజల్లుతోంది. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మురికిగుంటలో దోమలు, పందులకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రకరకాల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పరిసర ప్రాంతాల కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పరిసర ప్రాంతాల కాలనీవాసులు బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతికి పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు చొరవ తీసుకొని ఈ సమస్యను పరిష్కరించకపోతే వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

- భారీ వర్షం కురిసినప్పుడు రోడ్డుపై వాహనాల రాకపోకలు బంద్
- పట్టించుకొని అధికారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

రామంతాపూర్, జూన్ 14: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం డాన్స్ టీచర్ శ్రావణి ప్రియా శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మహాగణపతి, కొలువైతివా రంగా సాయి, చక్కని తల్లికి, మాధవ కేశవా, జతిస్వరం, మండూక శబ్దం, రామాయణం నృత్య రూపకం అంశాలను దివ్య, రిషిక, జష్మిత, కార్తీక, మాన్విత, సాయి చంద్రప్రియా, అభిరామి, షార్వి, సాయి ప్రగతి , అన్విత, సరితా, చరన్వి, నైతిక రెడ్డి, అశ్విని, శ్రీవల్లి, సాయి కీర్తన, సాయి సహస్ర , శ్రీ సంజన తదితరులు ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు. ప్రముఖ నాట్య గురువర్యులు కూచిపూడి కళానిపుణ రవి కళాకారులను అభినందించారు.

రక్తదానంతో ఆరోగ్యానికి ఎంతో మేలు

రక్తదానం చేసిన డాక్టర్లను సన్మానిస్తున్న కామినేని దవాఖాన యాజమాన్యం

మన్సూరాబాద్, జూన్ 14: 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే' సందర్భంగా ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖాన ఆధ్వర్యంలో తలసేమియా పిల్లల సంరక్షణ కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు వందకు పైగా డాక్టర్లు, నర్సులు, ఆస్పత్రి సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొని తల సేమియా చిన్నారుల కోసం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి బ్లడ్ సెంటర్ హెడ్ డాక్టర్ వివేకానంద, డాక్టర్ పునీత్, డాక్టర్ పునీత్ బాబు మాట్లాడుతూ, రక్తదానంతో ఎంతో మేలు అని, ఆరోగ్యాలకు ఎలాంటి హాని కలగదన్నారు. సమాజం పట్ల ఉన్న బాధ్యతను చాటడంతో పాటు ప్రాణాలను రక్షించే రక్తదానం పట్ల ప్రజలలో అవగాహన పెంచే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 100 సార్లకు పైగా రక్తదానం చేసిన దయాకర్ రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

మహేందర్ రెడ్డి

కందుకూరు, జూన్ 14 : సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయమని అడుగుతున్నందుకే కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి తెలిపారు మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అడుగుతూ, ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో మరోసారి ఏసీబీ నోటీసులు ఇవ్వడం చాలా దుర్మార్గమని అని అన్నారు. పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చడం కోసం డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టే విధంగా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఎంతో అద్భుతంగా హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించడం జరిగిందని, కానీ రేవంత్ రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలు చేపడుతూ ఏదోరకంగా కేటీఆర్‌ను కేసులో ఇరికించాలని, ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారని, ఇలాంటి బెదిరింపు ధోరణులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. అభివృద్ధి చేసింది ఎవరో అవినీతి చేస్తున్నది ఎవరో తప్పకుండా వాస్తవాలు త్వరలో బయటికి వస్తాయని తెలిపారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. నోటీసులు జారీ చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రభుత్వం ఆడుతున్న డ్రామా అని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కే పురం, జూన్ 13. దీర్ పార్క్, ఆటోనగర్ ఇండస్ట్రియల్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ డీఈ తెలిపారు. దీర్ పార్క్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా పరిసర ప్రాంతాలు.

ఆటోలో స్థాయికి నుంచి విద్యార్థులను ఎక్కించుకోరాదు

-మలక్ పేట ట్రాఫిక్ ఎస్సై రాము

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహనను కల్పిస్తున్న ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్సై రాములు

మలక్ పేట, జూన్ 14: పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు ఆటోల్లో స్థాయికి మించి పిల్లల్ని ఎక్కించుకోరాదని మలక్ పేట ట్రాఫిక్ ఎస్సై రాము ఆటో డ్రైవర్లకు సూచించారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో మలక్ పేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ రాము ఆధ్వర్యంలో శనివారం దిల్ సుఖ్‌నగర్లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిట్నెస్ లేకుండా వాహనాలను రోడ్లపై తిప్పరాదన్నారు. ఆటో డ్రైవర్లు వారి వాహనాలకు సంబంధించి ఫిట్నెస్‌ను తరచుగా చెక్ చేసుకోవాలని సూచించారు. స్థాయికి మించి ఆటోల్లో పిల్లలను తరలిస్తే కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. రోడ్లపై తిరిగే ప్రతి వాహనానికి ఫిట్నెస్ తప్పకుండా ఉండాలన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పక పాటించాలని, ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సురక్షిత ప్రయాణాల కోసం రోడ్డు సేఫ్టీ నియమాలను తప్పక పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గం

ఆర్.కె.పురం, జూన్ 13:. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలో గల అన్ని కోర్టు ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణ కుమార్ మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో సెటిల్ చేసుకోవడం ద్వారా సివిల్ కేసులలో చెల్లించిన కోర్టు ఫీజు కూడా తిరిగి పొందొచ్చు అని చెప్పారు. ఆస్తి పరమైన కేసులు, కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్ అదాలత్ లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అని అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీవాణి మాట్లాడుతూ, రంగా రెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో 22 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని, ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్జ్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్ అదాలత్ నిర్వహించుటలో పోలీస్ వారు, ఇన్సూరెన్స్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పానెల్ అడ్వొకేట్స్, డీఎల్ఎస్ఏ సిబ్బంది సహాయసహకారాలను అందించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కక్షిదారులకు ఉచితంగా భోజనాన్ని అందించింది. ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాదబీమా కేసులు, బ్యాంకు రికవరీ, ప్రీలిటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 2,05,000 పై చిలుకు కేసులు పరిష్కరించబడ్డాయి. అలాగే అన్ని కేసులలో కలిపి Rs.5,24,82,919/- రూపాయల వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగింది.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కందుకూరు , జూన్ 14 : అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు . మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ స్కూల్, ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డుకు ప్రభుత్వం ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ 9. లక్షలు మంజూరు చేసింది. రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డితో కలిపి శనివారం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రభుత్వం ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా మోడల్ స్కూల్ వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం కోసం మరో రూ. 10.లక్షల మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి. మండల కోఆర్డినేటర్ ఎండి అష్జల్ బేగ్. డైరెక్టర్ అంకగాల పుష్ప దర్శన్. మండల యూత్ అధ్యక్షుడు సొడపు వెంకటేష్ గౌడ్. ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్. గ్రామ అధ్యక్షుడు బొర్ర సురేష్. ఇందిరమ్మ కమిటీ డైరెక్టర్ ఎన్. నాగరాజ్ . బాచుపల్లి గ్రామ అధ్యక్షుడు కృష్ణ, కందుకూరు గ్రామ అధ్యక్షుడు కుమార్, మాజీ సర్పంచ్ పి. యాదిరెడ్డి. మాజీ ఉపసర్పంచ్ బి. శ్రీనివాస్. మాజీ వార్డు సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. '

సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో

అడ్మిషన్లు ప్రారంభం

ఘట్‌కేసర్, జూన్ 14: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు మండల స్థాయి సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు. ఘట్‌కేసర్ లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 17న 4వ తరగతి ప్రవేశం కోసం 3వ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అర్హులు అని చెప్పారు.

ఈ ప్రవేశానికి 2016 సెప్టెంబర్ 1నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బోనఫైడ్ సర్టిఫికెట్, 3 వ తరగతి పోగ్రెస్ కార్డ్, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఘట్‌కేసర్‌లో సంప్రదించాలని కోరారు. వివరాలకు శ్రీరాములు సెల్ నంబర్ 96405 01084 ను సంప్రదించాలన్నారు.

18న వేలం పాట

పోచారం,జూన్14: పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ శ్రీరంగనాథస్వామి ఆలయంలో పూజా సామగ్రి, కొబ్బరి కాయల విక్రయ వేలం పాటను ఈనెల 18 నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ వేలంను ఆలయంలో నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 1, 2025నుంచి,జూలై31,2026వరకు కొబ్బరి కాయలు,పూ జా సామగ్రిని విక్రయాలను నిర్వహించుకోవచ్చునని వివరించారు.ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10,000 చెల్లించాలని ఈవో సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సైదాబాద్, జూన్ 14: సైదాబాద్ ఎస్బీహెచ్ బ్యాంకు కాలనీలోని పద్మావతి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల వరకు ఉచిత బాడీ చెకప్ వైద్య శిబిర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మానవ శరీరంలోని వివిధ ముఖ్యమైన విభాగాలకు చెందిన 40 రకాల రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్త పరీక్షల రిపోర్టర్లు అనంతరం డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు సూచనలు, సలహాలను అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని కాలనీవాసులతోపాటు పరిసర కాలనీ వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

హలీలు, చాట కూలీలు గుర్తింపు కార్డులను తీసుకోవాలి

హమాలీలు, చాటకూలీలకు గుర్తింపు కార్డులపై కల్పిస్తున్న చిలక నరసింహారెడ్డి

మలక్ పేట, జూన్ 14: మలక్ పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ లో పనిచేస్తున్న హమాలీలు, చాట కూలీలు తప్పకుండా గుర్తింపు కార్డులను తీసుకోవాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి (ఎఫ్ ఏసీ) చిలక నరసింహారెడ్డి సూచించారు. మార్కెట్ కార్యాలయంలో శనివారం కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన గుర్తింపు కార్డులపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుర్తింపు కార్డులు ఉంటే ప్రభుత్వ పథకాలు అన్ని లభిస్తాయని ఆయన తెలిపారు. మార్కెట్‌కు పలు రాష్ట్రాల నుంచి సరుకును తెచ్చే రైతులు, వ్యాపారులు మార్కెట్ సిబ్బందిని సులువుగా గుర్తించడానికి వీలు ఉంటుందన్నారు. వ్యవసాయ మార్కెట్లో మొత్తం 542 మంది హమాలీలు, చాటకూలీలు పనిచేస్తున్నారని, వారందరూ తప్పకుండా గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని సూచించారు. గుర్తింపు కార్డులు ఉంటే మార్కెట్లో సముచిత గౌరవం లభిస్తుందని, హమాలీలు, చాటకూలీల పట్ల ఎవరు అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించడానికి వీలుండదని ఆయన తెలిపారు. మార్కెట్లో పనిచేసే ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డును కలిగి ఉండాలని, అదేవిధంగా రైతులు, వ్యాపారులు మార్కెట్ సిబ్బందిని సులువుగా గుర్తించేందుకు వీలుగా డ్రెస్ కోడ్ ల కోసం ఆర్డర్ ను సైతం ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ -3 కార్యదర్శి పుష్ప, సూపర్వైజర్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఆదాయాన్ని పెంచేందుకు కృషి

హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్లో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూనే, వ్యాపారులు కూడా నష్టపోకుండా మార్కెట్ ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నామని మార్కెట్ ఉన్నతి శ్రేణి కార్యదర్శి (ఎఫ్ఏసీ) చిలక నరసింహారెడ్డి అన్నారు. ఏడాది పొడవునా మలక్ పేట మార్కెలో రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నందున రాష్ట్రం తోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి రైతులు వారి పంటలను తెచ్చి అమ్ముకుంటారని ఆయన తెలిపారు. మార్కెట్ ఫుల్ అడిషనల్ చార్జి ఉన్నత శ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని పలువురు వ్యాపారులు నరసింహారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మార్కెట్లో తగిన వసతులు కల్పించడంతోపాటు, సరుకుకు ధరలను నిర్ణయించే విషయంలోనూ, వారికి సకాలంలో డబ్బులు చెల్లించే విషయంలోనూ, తక్ పట్టిల విషయంలోనూ పారదర్శకంగా సేవలు అందేలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా మార్కెట్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరించి, మెరుగైన వసతులు కల్పించి, మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు అశోక్‌తో పాటు మార్కెట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI AT MALKAJGIRI
O.S